PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక


DK MEDIA
approved by Govt of INDIA, TELANGANA
OUR SERVICES
* NEWS PAPER * DK ADS & PROMOTIONS
* NEWS CHANNEL * DK PRINTERS
* DK GRAPHICS * DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 21 బుధవారం, ఆగస్టు 19 2026, పేజీలు - 4 వెల : 5 రూ/-

## అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే

# పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి

**హైదరాబాద్ :** తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్? ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించిన ట్లు వెల్లడించారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరల గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్? ప్రభుత్వంలో సామాజిక న్యాయం : కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్?రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ అఘోరాల తో చేతబడులు చేయించారని ఆరోపించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు. మరోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్?నే : గత బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి.. రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రుల య్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



## ఎలక్షన్ కమిషన్ నిర్దాక్షిణ్యంగా

# ఓట్లను తొలగించింది



**హైదరాబాద్ :** ఓటర్ల జాబితా (ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఎన్నికల సంఘం తెలంగాణ లో నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. సర్ ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో బీఎల్‌వోలు ఎవరి ఇంటికీ వెళ్లలేదని ఆరోపించారు. పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారని విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీలాగే ఎన్నికల సంఘాన్ని కూడా తన జేబు సంస్థగా మార్చుకుందని చెప్పారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అకా రణంగా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందన్నారు. మొత్తంగా 92 లక్షల ఓట్లను ఈసీ ప్రశ్నార్థకం చేసిందని అన్నారు. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పువల్ల 2002 నాటవివరాలు సరిగా లేవనీ వివరాలు సరిగా లేవని చెప్పారు. లక్షల మంది ఓట్లు తొలగించి ప్రజాస్వామ్య దేశమంటే ఎలా..? అని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు.

## హరీశ్‌రావు కాదు.. అబద్దాల రావు

### ఆ భూములను 22ఏ నుంచి తొలగిస్తాం..



**హైదరాబాద్, ఆగస్టు 18 :** మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్దాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని సెటైర్లు గుప్పించారు. (మంగళవారం)మంత్రి పొంగులేటి మాట్లాడా రు. గతంలో సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగిందని తామే గుర్తించామని పేర్కొన్నారు. హరీశ్‌రావు ఎత్తు పెరగడం కాదని.. విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలని మంత్రి వ్యగ్యంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగనివబోమని అన్నారు. ప్రభుత్వ భూములు కాకపోతే కచ్చితంగా వాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో మాదిరిగా తాము బుకాయించడం లేదని చెప్పారు. కేంద్రం, ఎన్నికల సంఘం, బీఆర్ఎస్ కలిసి ఓట్లను తొలగించే కుట్రను చేస్తున్నాయని.. వారి పప్పులు ఉడకనివ్వబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

## 'నీట్' విద్యార్థులపై

# పోలీసు చర్యలు

**ఢిల్లీ:** ఢిల్లీలో నీట్ నిరసనల సందర్భంగా విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసులు అతిగా చర్యలు తీసుకున్నారనే ఆరోపణలపై విచారణ చేసేందుకు ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. ఇందులో రిటైర్డ్ న్యాయమూర్తులు, మాజీ డీజీపీ, మాజీ సీబీఐ డైరెక్టర్లు ఉంటారని స్పష్టం చేసింది. ఇంకా ఈ కమిటీలో చేర్చాల్సిన ఇతర సభ్యుల గురించి వివిధ పక్షాల నుంచి సూచనలు అందిన తర్వాత, కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వులను బుధవారం విడుదల చేస్తామని తెలిపింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్? జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్? వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ చేపట్టింది. జులై 20న ఢిల్లీలో జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసకు సంబంధించిన వీడియో ఫుటేజీ, సీసీటీవీ రికార్డింగ్?లను, తాము ఏర్పాటు చేయనున్న హైపవర్ కమిటీకి అందజేయాలని ఆదేశించనున్నట్లు పేర్కొంది. ఢిల్లీ సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన నిరసనల్లో పాల్గొన్న మహిళల ఫిర్యాదులను, ఆరోపణలను కూడా ఈ కమిటీ పరిశీలిస్తుందని స్పష్టం చేసింది.

## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి

# రూ. 15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

**హైదరాబాద్ :** నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న శ్రీధర్ బాబుతెలంగాణ పారిశ్రామిక రంగానికి జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఒక కొత్త ఊపునివ్వనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ స్మార్ట్ సిటీ పూర్తి స్థాయిలో అందు బాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 3,245 ఎకరాల భారీ విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఈ స్మార్ట్ సిటీ ద్వారా సుమారు రూ. 15 వేల కోట్ల పెట్టుబడు లను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకు న్నట్లు చెప్పారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మం త్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య-పరిశ్ర మల మంత్రి పీయూష్ గోయెల్‌లు సం యుక్తంగా నిర్వహించిన 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో జరుగుతున్న ఈ పనులను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇదే క్రమంలో, 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు కోరారు.



## మీరు చేసిన తప్పులకి

# ప్రజలకు ఎందుకు శిక్ష.


**మల్కాజిగిరి, ఆగస్టు 18:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయి లో విరుచుకుపడ్డారు. (మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష? పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30% గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30% కమీషన్ అడుగుతున్నారు' అంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్టర్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్ట్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## మున్సిపాలిటీల్లో బీసీలకు

# 34 శాతం రిజర్వేషన్



**అమరావతి:** బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం కేవలం ఎన్నికల హామీ కాదని, అది తమ రాజకీయ సిద్ధాంతంలో భాగమని చంద్రబాబు స్పష్టం చేశారు. హామీలు ఇవ్వడంతోనే ఆగిపోకుండా వాటిని అమలు చేసి చూపిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం బిసిలకు రిజర్వేషన్ల విషయంలో చేసిన అన్యాయన్ని సరిచేయడానికి ప్రత్యేక క్యాబినెట్ పెట్టి నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చెప్పారు. 2024 ఎన్నికల్లో ఈ స్థాయి గెలుపుకు కారణం బిసిల వల్లేనని చెప్పుకొచ్చారు. 94శాతం స్ట్రయిక్ రేట్ 57శాతం ఓట్లు వచ్చాయంటే అది బిసిల వల్ల, నాయకత్వంపై ఉన్న నమ్మకం వల్ల మాత్రమేనని పేర్కొన్నారు. బిసిలకు న్యాయం చేయాలని తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలు ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకున్నామన్నారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారు. ఈ రెండు అంశాలకు సంబంధించిన నిబంధనలు చట్టాల్లో ఉన్నాయని వివరించారు. అర్బన్ లోకల్ బాడీల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధానం ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు. రాబోయే రోజుల్లో 28 జిల్లా పరిషత్‌లు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

## ఆ భూములను లాక్కుంటే..

# చూస్తూ ఊరుకోం.

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ లాక్కుంటే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. (మంగళవారం) హైదరాబాద్ లోని బంజారా హిల్స్ టీఆర్ఎస్ కార్యాలయ ంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీల కు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్ర ం సామాజిక న్యా యం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. విజయశాంతి లాంటి ఉద్యమకారుల ను పక్కన పెట్టారు. .విజయ శాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వం నియమించిన అడ్వైజర్ల జీతాల విషయంలోనే సామాజిక న్యాయం ఎందుకు కనిపించట్లేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం ఆటవికా న్యాయమా..? అని ప్రశ్నించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఓ రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా..? ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం.? అని ప్రశ్నల వర్షం కురిపించారు.



PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక

# రోడ్డుపైనే బస్ షెల్టర్

- ఇది మంచిక లేక ప్రమాదానికి సూచికన
- దీనికి అర్థం అధికారులే చెప్పాలి
- రోజుల తరబడి రోడ్డు పక్కన ఇలా ఉంటే ఎలా
- నిలబెట్టరు లేదా తొలగించరు ఇదేం పద్ధతి
- పట్టించుకుంటారా లేక వదిలేస్తారా



**భద్రాద్రి కొత్తగూడెం:** ఇది ప్రధాన రోడ్డు.. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.. ఆపై పక్కనే పోలీస్ స్టేషన్.. రోడ్డుపైనే కూలిపోయిన బస్సు షెల్టర్ పై కప్పు చిత్తు ఇనుము రోజుల తరబడి వచ్చి పోయే వారికి కనిపిస్తుంది.. ఇది మంచిక లేక ప్రమాదానికి సూచికనా..? అంటూ పలువురు గుసాయిస్తున్న పరిస్థితి నెలకొంది. కొత్తగూడెం కార్పొరేషన్ పరిది లోని పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ప్రయాణికుల వేచి ఉండేందుకు ఇటీవల బస్ షెల్టర్ ఏర్పాటు చేయడం జరిగింది. అయితే కొన్ని రోజులకే ఈ బస్సు సెంటర్ ను ఏదో వాహనం ఢీకొని కుప్పకూలినట్లుగా పలువురు చర్చిం చుకుంటున్నారు. కుప్పకూలిన బస్ షెల్టర్ యూనిట్ ను నిలబెట్టేందుకు చర్యలు తీసుకొని కారణంగా అలాగే వదిలేయడం వల్ల చర్చకు దారి తీస్తుంది. రోజుల తరబడి రోడ్డు పక్కనే నేలకొరిగిన బస్ షెల్టర్ చిత్తు ఇనుమును తొలగించేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

చిత్తు ఇనుము వల్ల ప్రమాదం పొంచి ఉందని పలువురు వాహ నదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమా దాలు జరగక ముందే రోడ్డుపై ఉన్న బస్ షెల్టర్ చిత్తు ఇనుమును తొలగించేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకో వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నేతాజీ చూపిన మార్గంలో నడవడమే మనందరి బాధ్యత

- బిసి సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షులు చీమల్ వార్ శ్రీనివాస్



**కామారెడ్డి జిల్లా, విశాలజ్యోతి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం గాంధారి మండల శాఖ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ ను స్మరించుకుంటూ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బిసి సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షులు చీమల్ వార్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేతాజీ అనేక కష్టాలను ఎదుర్కొని ఆజాద్ హింద్ ఫౌజ్ ను ఏర్పాటు చేశారని అన్నారు. "మీరు నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను" అనే నినాదంతో యువతలో దేశభక్తి రగిలించారని, తన ప్రాణాలను కూడా దేశం కోసం పణంగా పెట్టారని గుర్తు చేశారు. నేతాజీ త్యాగమే ఈరోజు మనం స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడానికి కారణమని ఆయన చూపిన మార్గంలో నడవడమే మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దోల్లు లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీలు నస్కంటి రవి,సామల రాజు, వంజరి రాకేష్, యూత్ అధ్యక్షులు సిందే నితిన్, టౌన్ సెక్రటరీ ఆరె కటిక మోతిలాల్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఆకుల రాకేష్, ఎండ్రియాల గోపాల్ తదితరులు పాల్గొన్నారు

## 'పెద్ది విగ్రహ కూల్చివేతకు కాంగ్రెస్సే కారణం ఎర్రబెల్లి దయాకర్ రావు



**హైదరాబాద్:** తెలంగాణ భవన్‌లో మంగళ వారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూయజమాని విద్యాసాగర్ అనుమతితోనే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం పెద్ది అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించినపుడు విగ్రహాన్ని ఎందుకు కూలగొడతుంది అని అన్నారు. కాంగ్రెస్ నేతలకు సిగ్గుండాలి. కూల్చిన చోటే విగ్రహాన్ని పెట్టాలి. నర్సంపేటలోని ప్రతి గ్రామం లో పెద్ది విగ్రహం ఏర్పాటు చేస్తాం. నర్సంపేటలో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ది ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే జరిగాయి. నర్సంపేట మెడికల్ కాలేజీ కి పెద్ది పేరు పెట్టాలి. పెద్ది విగ్రహం యథాస్థానంలో పెట్టకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని ఎర్రబెల్లి హెచ్చరించారు.

# సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో సామాజికన్యాయాన్ని సాధిద్దాం

- బార్ అసోసియేషన్ అధ్యక్షులు చకిలం ఉపేందర్, చొల్లేటి రామకృష్ణ
- వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ లో పాపన్న వర్ధంతి




**హనుమకొండ, విశాలజ్యోతి:** బహుజన వీరుడు, గోల్కొండ ఖిల్లాను ఏలిన రాజు సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వరంగల్ బార్ హాల్ లో మంగళవారం ఘనంగా జరిగింది. వరంగల్, హనుమకొండ బార్ అధ్యక్షులు చకిలం ఉపేందర్, చొల్లేటి రామకృష్ణ లు మాట్లాడుతూ సమస్త పీడిత ప్రజల విముక్తి కోసం సాహసోపేతమైన పోరాటం చేసి గోల్కొండ కోటపై రాజ్య నిర్మాణం చేసిన పాపన్న స్ఫూర్తితో సామాజికన్యాయానికి పెద్ద పీట వేయాలని, న్యాయవాద రంగంలో అణగారిన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే గొప్ప వీరుడిగా పేరుగాంచిన సర్వాయి పాపన్న వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ లో జన్మించడం మనకు గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ కడు పేదరికంలో జన్మించి భూస్వాముల దగ్గర కూలీ చేసుకునే పాపన్న పీడిత ప్రజల కష్టాలను చూసి చలించి ప్రజలను చైతన్యం చేసి, ప్రజల చేత యుద్ధం చేపించి అంతిమంగా ఆనాటి మొగల్స్ రాజ్యాన్ని హస్తగతం చేసుకొని ప్రజా రాజ్యాన్ని ఏర్పాటు చేయడం భారతదేశంలోనే గొప్ప విషయమని అన్నారు. పాపన్న లాంటి ఎందరో బహుజన మహా వీరులు దేశంలో విముక్తి పోరాటాలు చేసి విజయాలు సాధించారని, తీవ్ర నిర్బంధం, ఎలాంటి సౌకర్యాలు లేని కాలంలో పీడిత ప్రజలను చైతన్యం చేసి విముక్తి పోరాటాలను విజయవంతం చేసి రాజ్యాలను ఏలిన ఛత్రపతి శివాజీ, పండుగ సాయన్న, సాహు మహారాజ్ లాంటి వీరుల స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపనకు కృషి చేయాలని అన్నారు. మూడు వందల ఏండ్ల క్రితమే తన రాజ్య పాలనలో సామాజికన్యాయాన్ని అమలు చేసిన పాపన్న స్ఫూర్తితో నేటి రాజ్యంలో సకల సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా దక్కాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శులు నాగేంద్రచారి, ఊరుగొండ నరేందర్, ఉపాధ్యక్షులు సాంబశివరాజు, రఘుపతి, మహిళా ఉపాధ్యక్షులు లలిత కుమారి, వనజ, బార్ అసోసియేషన్ నాయకులు జంగ స్వప్న, ఎస్ కవిత, ఆడెపు సునీల్, ఉమా మహేశ్వరి, గౌడిశాల సుజాత, పూసపెల్లి శ్రీనివాస్, మహేందర్ తో పాటు న్యాయవాదులు బత్తిని రమేష్ గౌడ్, శ్రీధర్, రామనాథం, కోటేశ్వరరావు, కిషన్ గౌడ్, పైళ్ల సంతోష్ తదితరులు హాజరై పాపన్న చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు.

# షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం




**కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి:** కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు, ఆసిఫాబాద్ షీ టీమ్, పిటిజి బాయ్స్ రెసిడెన్సిల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా బిక్కులాల్ ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రేరణాత్మక తరగతులు నిర్వహించి,ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల దుష్ప్రభావాలను వివరించారు. సోషల్ మీడియా కారణంగా కలిగే మానసిక ఒత్తిడి, వల్ల చదువు సన్నగిల్లుతుందని అన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆసిఫాబాద్ షీ టీం ఫోన్ నంబర్ 8712670564 కు సమాచారం అందించాలని విద్యార్థులను కోరారు.

ఈ కార్యక్రమం లో షీ టీం ఎస్సై బిక్కులాల్ , ప్రిన్సిపాల్ సుజాత ,సిబ్బంది స్వప్న, , వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**తొర్రూరు, విశాలజ్యోతి:** తొర్రూరు డివిజన్ కేంద్రంలో బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు తొర్రూర్ గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్, వైస్ చైర్మ సోమ రజని, మున్సిపల్ కౌన్సిలర్లు పేర్ల జంపన్న, తూర్పాటి రవి హాజరై వారు సంయుక్తంగా మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడి మొగలులను ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగరేసిన దీశాలి అని కొనియాడారు. కార్యక్రమంలో గోపాల్ జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, జిఎస్పిఎస్ అధ్యక్షుడు దికొండ శ్రీనివాస్ గౌడ్, కె ఎస్ పి ఎస్ గౌరవ అధ్యక్షులు శామకూరి ఐలయ్య గౌడ్,అధ్యక్షుడు నాగపురి అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కుంభం మహేష్ కుమార్ గౌడ్, ఎస్ ఎస్ పి జి ఎ అధ్యక్షుడు చీకటి అశోక్ గౌడ్ ప్రధాన కార్యదర్శి గుర్రం వెంకన్న గౌడ్, గౌడ సంఘ నాయకులు మోడెం వెంకన్న గౌడ్, దేశగాని కుమార్ గౌడ్, కోటగిరి కుమార్ గౌడ్ తాళ్లపల్లి బిక్షంగౌడ్, శీలం లింగన్న గౌడ్, పెరుమాండ్ల రవి, గౌడ్, తాండాల ఎల్లా గౌడ్, రావుల రాములు చల్లపల్లి హేమాద్రి గౌడ్,బొమ్మగాని ఓం ప్రకాష్, మోడెం సోమ నరసయ్య, మద్దెల యాకన్న, బోలగాని మహేష్, క్రాంతి, బొమ్మగాని మనోజ్, బొమ్మెర రాజేష్ బుచ్చి రాములు, బొలగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గౌడ సంఘ నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసా గించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు వారి స్ఫూర్తితో రాజ్యాధికారం దిశగా బహు జనులంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు.

# నిర్బంధాలకు స్వస్తి పలకండి

- వైద్య శాఖల మధ్య సమన్వయ అవసరం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించాలి
- డీఎంఎఫ్‌టీ నిధులు వివరాలు వెలడించాలి
- ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను వెంటనే మంజూరు చేయాలి
- దిశ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** కొత్తగూడెం నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ఇళ్లకు నంబర్లు ఇవ్వకుండా అటవీ అధికారులు అడ్డుకోవడం సరికాదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ఐడిఓసిలో నిర్వహించిన దిశా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురిచేసే చర్యలను నిలిపివేయాలని పెండింగ్ పోడు భూముల పట్టాలు ఇవ్వాలని కోరారు. వైద్య విధాన పరిషత్ డీఎంహెచ్ఓ డీఎంఈ విభాగాల మధ్య సమన్వయ లోపంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న వైద్యులు నర్సులు ఇతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గత రెండున్నరేళ్లలో కొత్తగూడెం నియోజకవర్గానికి కేటాయించిన డీఎంఎఫ్‌టీ నిధుల వివరాలను వెల్లడించాలని ఆయన దిశా సమావేశంలో కోరారు. యాప్ సహకరించడం లేదని సాకుతో నిలిపివేసిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, ఇళ్లు నిర్మించుకునే పేదలకు అధికారులు సహకరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారంలో దిశా కమిటీ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు ప్రకటించింది. దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఐటీడీఏ పీవో రాహుల్, కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్‌డీఓ విద్యా చందన, మున్సిపల్ చైర్‌పర్సన్లు, దిశా కమిటీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 15 జిల్లా బాల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలు



**కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి:** ఈ నెల 21 న కొమురంభీం బీమ్ జిల్లా, ఆసిఫాబాద్ సోషల్ వెల్ఫేర్ పాఠశాల మైదానంలో అండర్ 15 బాల్ బ్యాడ్మింటన్ బాల బాలికల ఎంపిక పోటీలు జరుగుతాయి అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు 02.01.2011 తర్వాత జన్మించి ఉండాలి, తమ వెంట ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. క్రీడాకారులు ఉదయం 10గంటలకు గ్రౌండ్ లో సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ రహీం కు రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఇక్కడ ఎంపిక అయినా క్రీడాకారులు ఈ నెల 28 నుండి 30వరకు ఉమ్మడి మెదక్ జిల్లా లో బి హెచ్ ఈ ఎల్ లో జరుగు 45 వ బాల్ బాడ్మింటన్ అంతర్ జిల్లాల పోటీలో పాల్గొంటారు అని తెలిపారు. ఇక్కడికి వచ్చే క్రీడాకారులు వివరాలకోసం ఖేలో ఇండియా కోచ్ రాకేష్ 8247096710, పి డి యాదగిరి 7660888226 లను సంప్రదించగలరు.

## భోగాపురం వెళ్లే ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్




శంషాబాద్ విమానాశ్రయం నుంచి భోగాపురం వెళ్లే ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉండగానే దుండగులు ఈ బెదిరింపు మెయిల్ పంపించారు. దాంతో వెంటనే అప్రమత్తమైన విమానాశ్రయ సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ కు చెదిన అధికారులు బాంబ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి తనిఖీలు చేశారు.ఎయిర్‌పోర్టు అంతటా అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు..

# ప్రజా సమస్యలపై మహా ధర్నా అనుమతి కోసం వినతి




**వరంగల్, విశాలజ్యోతి:** వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీన భారీ ఎత్తున 'మహా ధర్నా' కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, కొలను సంతోష్ రెడ్డి తెలిపారు. ఈ మహా ధర్నా కార్యక్రమాన్ని శాంతి యుతంగా నిర్వహించుకునేందుకు చట్టపరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ, ఈరోజు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత గారిని నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.వారితో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జలగం రంజిత్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శి పోనుగోటి వెంకట్ రావు గార్లు పాల్గొన్నారు.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

# క్షుద్ర రాజకీయాలు దేనికి సంకేతం



వర్షాలకు పూజల ముడి.. రాజకీయాలకు మూఢనమ్మకాల రంగుఅందరికీ ఆదర్శంగా ఉండాల్సిన వాళ్లే అందవిశ్వాసాలకు ఆద్యం పోస్తే సమాజానికి ఏం సందేశం ప్రజాస్వామ్యంలో రాజకీయాలు ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఉండాలి. ప్రజల సమస్యలపై చర్చ జరగాలి. పాలకులు విధానాలు వివరించాలి. ప్రతిపక్షాలు వైఫల్యాలు ఎతిచూపి ప్రత్యామ్నాయాలు సూచించాలి. ఇదే ఆరోగ్యకర ప్రజాస్వామ్యం. కానీ రాజకీయ చర్చల స్థాయి ప్రజా సమస్యల నుంచి వ్యక్తిగత ఆరోపణలు, మూఢనమ్మకాలు, క్షుద్ర పూజల ఆరోపణల దిశగా మళ్లితే సమాజం ఆలోచించాల్సిన పరిస్థితి. తెలంగాణలో మాజీ మంత్రి హరీశ్‌రావు వర్షాలు పడకుండా ఉండాలని క్షుద్రపూజలు చేయించారంటూ కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత రెడ్డి సైతం ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు వార్తలు వచ్చాయి. హరీశ్‌రావు వర్గం వీటిని ఖండిస్తూ చట్టపరమైన చర్యలకు దిగింది. ఈ ఆరోపణల్లో నిజానిజాలు ఆధారాలతో తేలాలి. కానీ అంతకంటే కీలకమైన ప్రశ్న ఇది. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన నాయకులు.. ప్రకృతి పరిణామాలను మూఢనమ్మకాలతో ముడిపెట్టి రాజకీయ అస్త్రాలుగా ఉపయోగించడం సమాజానికి ఏం సందేశం ఇస్తుంది

**వర్షానికి రాజకీయ రంగు ఎందుకు**

వర్షం ఒక సహజ ప్రకృతి ప్రక్రియ. వాతావరణంలో తేమ, ఉష్ణోగ్రతలు, గాలుల కదలికలు, పీడన పరిస్థితులు, సముద్ర ప్రభావాలు వర్షపాతాన్ని నిర్ణయిస్తాయి. వర్షాలు తగ్గితే రైతులు ఆందోళన చెందుతారు. జలాశయాల పరిస్థితిని సమీక్షించాలి. ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపట్టాలి.అలాంటి సమయంలో చర్చ జరగాల్సింది,ఎంత నీరు అందుబాటులో ఉంది ఎన్ని ఎకరాలకు సాగునీరు వర్షాభావాన్ని ఎలా ఎదుర్కోవాలి రైతులకు ఏ పంటల సలహా వాతావరణ హెచ్చరికలను గ్రామస్థాయికి ఎలా తీసుకెళ్లాలి కానీ వాటికి బదులు 'ఎవరు పూజలు చేశారు' అనే చర్చ మొదలైతే ప్రజా సమస్య పక్కదారి పట్టినట్లే. వర్షం కోసం రైతు ఆకాశం వైపు చూస్తుంటే.. రాజకీయాలు ఒకరిపై ఒకరు వేలెత్తి చూపడంలో ఉంటే ప్రయోజనం ఎవరికి?

**ఆరోపణకు ఆధారం ఉండాలి**

రాజకీయాల్లో విమర్శలు సహజం. ప్రత్యర్థుల విధానాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు. కానీ ప్రతి ఆరోపణకు ఆధారం ఉండాలి. అవినీతి అంటే ఆధారాలు చూపాలి. ప్రభుత్వం విఫలమైందంటే గణాంకాలు చెప్పాలి.

అదేవిధంగా క్షుద్రపూజలు చేశారనే ఆరోపణ చేస్తే కూడా దానికి ఆధారాలు ఉండాలి. ఆధారం లేని ఆరోపణ రాజకీయ విమర్శగా మొదలై.. ప్రజల్లో అపోహలకు విత్తనంగా మారుతుంది. ఇలాంటివి ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపలేవు.

**నేతల మాటలకు విలువ ఎక్కువ ఉంటుంది**

సాధారణ వ్యక్తి మూఢనమ్మకాన్ని నమ్మడం వేరు. ప్రజలను ప్రభావితం చేసే నాయకుడు బహిరంగంగా చెప్పడం వేరు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి, వర్షాలు, పంటలపై ఇప్పటికే అనేక అపోహలు ఉన్నాయి. రైతులకు శాస్త్రీయ వ్యవసాయం నేర్పాల్సిన నాయకులు.. వాతావరణ సమాచారం తీసుకెళ్లాల్సిన ప్రభుత్వాలు.. మూఢనమ్మకాల చర్చకు ప్రాధాన్యం ఇస్తే పరిస్థితి ఏమిటినాయకులు ప్రజలను చైతన్యపరచాలా లేక భయాలు, అపోహలకు రాజకీయ రంగు పులమాలా ఈ ప్రశ్నకు సమాధానం అధికార పక్షానికే కాదు.. ప్రతి పక్షానికీ ఉంది.

**వ్యక్తిగత విశ్వాసం వేరు.. రాజకీయ ప్రచారం వేరు**

ఎవరైనా వ్యక్తిగతంగా పూజలు చేయడం, ఆలయాలకు వెళ్లడం వారి స్వేచ్ఛ. దాన్ని గౌరవించాలి. కానీ ఒక వ్యక్తి వ్యక్తిగత విశ్వాసాన్ని ప్రకృతి పరిణామాలకు కారణంగా చూపడం.. దానిని రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం వేరు. భక్తి వ్యక్తిగతం.. పాలన ప్రజలది.విశ్వాసం వ్యక్తిగతం.. విధానం శాస్త్రీయం కావాలి.

**రైతుకు కావాల్సింది పూజల ఆరోపణలు కాదు**

తెలంగాణలో రైతు వర్షం కోసం ఎదురు చూస్తాడు. పంట వేసిన తర్వాత నీటి కోసం ఆందోళన చెందుతాడు. తెగుళ్లు, ఎరువులు, కూలీల కొరత, మార్కెట్ సమస్యలను ఎదుర్కొంటాడు. అతని సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. రైతుకు కావాల్సింది క్షుద్రపూజల కథలు కాదు.. పంటకు శాస్త్రీయ సలహాలు.వర్షాలు తగ్గితే ప్రత్యామ్నాయ పంటల సూచనలు కావాలి. నీటి కొరత ఉంటే సూక్ష్మ నీటిపారుదలను ప్రోత్సహించాలి. పంట నష్టపోతే నష్టపరిహారం అందాలి. ధర పడిపోతే మార్కెట్ మద్దతు కల్పించాలి. రైతు జీవితాన్ని మార్చేది రాజకీయ ఆరోపణలు కాదు.. ఆచరణాత్మక విధానాలు.

**ఇది రాజకీయ పార్టీల సమస్య మాత్రమే కాదు**

ఈ అంశాన్ని ఒక పార్టీకి పరిమితం చేయడం సరైంది కాదు. అధికారంలో ఉన్నవారైనా.. ప్రతిపక్షంలో ఉన్నవారైనా ఒకే ప్రమాణం పాటించాలి. ప్రత్యర్థిని విమర్శించండి.. కానీ ఆధారాలతో. ప్రభుత్వాన్ని ప్రశ్నించండి.. కానీ గణాంకాలతో.

**విధానాలనువ్యతిరేకించండి..**
**కానీ ప్రత్యామ్నాయాలతో.**

ఈ రోజు ఒక పార్టీ మూఢనమ్మకపు ఆరోపణ చేస్తే.. రేపు అదే ఆయుధం మరో పార్టీ చేతిలోకి వెళ్తుంది. చివరికి దెబ్బతినేది ఒక నాయకుడు కాదు.. రాజకీయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం.

**రాజకీయాలకు కొత్త ప్రమాణాలు అవసరం**

నాయకుడి స్థాయిని అతను ఎంత ఘాటుగా ప్రత్యర్థిని విమర్శించాడనే దానితో కొలవకూడదు. ఎన్ని సమస్యలకు పరిష్కారాలు చూపాడు ఎన్ని కుటుంబాలకు భరోసా ఇచ్చాడు ఎంత శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించాడు? ఇవే నాయకత్వానికి అసలు కొలమానాలు. ప్రజలను భయపెట్టే నాయకత్వం కాదు.. ప్రజలను ఆలోచింపజేసే నాయకత్వం కావాలి.

**ప్రశ్నించాల్సింది ప్రత్యర్థిని కాదు.. సమస్యను**

వర్షాలు రాకపోతే వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేయాలి. పంటలు ఎండిపోతే నీటి నిర్వహణను సమీక్షించాలి. రైతు నష్టపోతే ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలి. సమస్యకు కారణం వెతకాలి.. రాజకీయ ప్రత్యర్థిని కాదు. ఇదే ప్రజాస్వామ్య స్ఫూర్తి.


**చివరికి ప్రశ్న మనందరిదీ**

మన రాజకీయాలు ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నాయా లేక భయాలు, అపోహాలు, మూఢనమ్మకాలకు బలం చేకూరుస్తున్నాయా వర్షం ప్రకృతి ప్రసాదం.. రాజకీయ ఆయుధం కాదు. ప్రజాస్వామ్యం ప్రజల సమస్యలకు వేదిక.. మూఢనమ్మకాల ప్రచార వేదిక కాదు.రాజకీయాలు మారాలి. చర్చల స్థాయి పెరగాలి. ఆరోపణలకు ఆధారాలు రావాలి. క్షుద్ర రాజకీయాలకు ముగింపు పలికి.. శాస్త్రీయ ఆలోచనకు పట్టం కట్టినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది



వ్యాసకర్త:
జి. అజయ్ కుమార్

# మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం అవి మనకు సరిపోవట ఎందుకంటే



మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది

**ఆహారాల్లో తేడాలే కారణం..**

తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు గట్‌లోని బ్యాక్టీరియాపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు పరిశోధన సూచించింది. సాధారణంగా కనిపించే బిఫిడో బ్యాక్టీరియం అడోలెసెంటిస్ వంటి బ్యాక్టీరియాలోనూ పాశ్చాత్య దేశాల ప్రజల గట్ నమూనాల్లో అరుదుగా కనిపించే కార్బొహైడ్రేట్ ప్రాసెసింగ్ జన్యువులను గుర్తించారు. అంటే భారతీయుల సంప్రదాయ ఆహారంలో ఉండే కొన్ని పదార్థాలను జీర్ణం చేసుకోవడానికి ఇక్కడి గట్ బ్యాక్టీరియా కాలక్రమేణా ప్రత్యేకంగా అనుకూలించి ఉండే అవకాశం ఉంటుంది. బార్లీ, గోధుమలు, సంప్రదాయ పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడంలో సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలు స్థానిక బ్యాక్టీరియాలో కనిపించినట్లు పరిశోధన వెల్లడించింది. దీని ద్వారా మనం తీసుకునే ఆహారం కేవలం మన శరీరాన్నే కాకుండా, మన గట్‌లో నివసించే సూక్ష్మజీవుల సముదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు మార్కెట్లో లభించే అనేక ప్రోబయోటిక్ ఉత్పత్తుల్లో యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య ప్రాంతాల ప్రజల్లో గుర్తించిన బ్యాక్టీరియా స్ట్రెయిన్లను ఉపయోగిస్తున్నారు. మంచి బ్యాక్టీరియాగా పరిగణించే ఒక స్ట్రెయిన్ ఎక్కడి వ్యక్తి గట్‌లోకి వెళ్లినా ఒకే విధంగా పనిచేస్తుందనే ఆలోచన దీనికి కారణం. అయితే తాజా పరిశోధన ఈ విధానాన్ని మరో సారి ఆలోచించాల్సిన అవసరాన్ని సూచి స్తోంది.


**ప్రోబయోటిక్స్ ఆపేయాలా..**

ఒక నిర్దిష్ట ఆహార విధానానికి, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా అభివృద్ధి చెందిన బ్యాక్టీరియా మరో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్న వ్యక్తి గట్‌లోకి వెళ్లినప్పుడు అదే స్థాయిలో స్థిరపడవు. అలాగే అక్కడ ఉన్న సూక్ష్మజీవుల సముదాయంతో కలిసి అదే విధంగా పనిచేయవు. అందువల్ల ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సమాన ప్రయోజనం ఇస్తుందనే భావనను పరిశోధన ప్రశ్నిస్తోంది. అయితే దీనర్థం మార్కెట్లో లభించే ప్రోబయోటిక్స్ అన్నింటినీ వెంటనే ఆపేయాలని కాదు. ప్రోబయోటిక్స్ అనే భావనను తిరస్కరించడం కంటే, ఏ బ్యాక్టీరియా స్ట్రెయిన్ ఎవరికి, ఏ ఆహార విధానం ఉన్న వ్యక్తులకు, ఏ గట్ మైక్రోబయోమ్ నేపథ్యంలో ఉపయోగపడుతుందనే అంశంపై మరింత పరిశోధన అవసరమని ఈ పరిశోధన సూచిస్తోంది. భారతీయుల గట్‌కు అనుగుణంగా స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లను గుర్తించి, వాటిపై పరిశోధనలు చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి ప్రోబయోటిక్ ఉత్పత్తులను అభివృద్ధి చేసే అవకాశం భవిష్యత్తులో పెరుగుతుంది. ముఖ్యంగా భారతీయుల సంప్రదాయ ఆహార విధానాలు, స్థానిక ఆహార పదార్థాలు, గట్‌లో ఇప్పటికే ఉన్న సూక్ష్మజీవుల సముదాయాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించే విధానాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయనే ఆలోచనకు ఈ పరిశోధన బలం చేకూరుస్తోంది.

**ఒక్క ట్యాబ్లెట్ కీలకం కాదు..**

గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక్క ప్రోబయోటిక్ సప్లిమెంట్‌పైనే ఆధారపడాల్సిన అవసరం లేదని కూడా ఈ అంశం గుర్తుచేస్తోంది. వైవిధ్యమైన, పీచు పదార్థాలు అధికంగా ఉండే సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం గట్‌లోని సూక్ష్మజీవుల వైవిధ్యానికి అనుకూలంగా ఉంటుంది. ఒక నిర్దిష్ట ప్రోబయోటిక్‌ను కేవలం ప్రకటనలు లేదా మార్కెటింగ్ ఆధారంగా ఎంచుకోవడం కంటే, అవసరం ఉంటే వైద్య నిపుణుల సలహాతో తీసుకోవడం మంచిది. దేశంలోని గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌పై జరిగిన ఈ పరిశోధన దేశంలో ఇప్పటివరకు పెద్దగా గుర్తించని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. భవిష్యత్తులో మరిన్ని స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లపై పరిశోధనలు జరిగితే భారతీయుల ఆహార విధానం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రోబయోటిక్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అంటే విదేశాల్లో అభివృద్ధి చేసిన ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సరిపోతుందా అనే ప్రశ్నకు బదులుగా, వ్యక్తి ఆహారం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా సరైన బ్యాక్టీరియాను ఎంచుకోవడంపై భవిష్యత్తు పరిశోధనలు దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

# దీర్ఘకాలంగా ఒత్తిడి ఉంటే కొలెస్ట్రాల్‌పై ప్రభావం పడే ప్రమాదం హెచ్చరిస్తున్న నిపుణులు



ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు సాధారణంగా మారుతున్నాయి. అయితే వీటి ప్రభావం కేవలం మానసిక ఆరోగ్యంపైనే కాకుండా గుండె ఆరోగ్యంపైనా పడుతోంది. ముఖ్యంగా దీర్ఘకాలిక ఒత్తిడి, అధిక కొవ్వులు, చక్కెరలు ఉన్న ఆహారం తీసుకోవడం వంటి కారణాలు కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండె జబ్బులు, రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అందుకే ఒత్తిడిని నియంత్రించడంతోపాటు ఆహారపు అలవాట్లపైనా దృష్టి పెట్టడం అవసరం. ఒత్తిడి కొలెస్ట్రాల్‌ను నేరుగా ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మనం ఒత్తిడికి గురైనప్పుడు శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు ఎక్కువగా విడుదలవుతాయి. ఇవి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శరీరాన్ని సిద్ధం చేసే ఫైట్ ఆర్ ఫ్లైట్ ప్రతిస్పందనలో భాగంగా పనిచేస్తాయి. అయితే ఒత్తిడి దీర్ఘకాలం కొనసాగితే ఈ హార్మోన్ల ప్రభావం శరీరంలోని జీవక్రియలపై పడుతుంది.

**రక్తనాళాల్లో పేరుకుపోయే కొవ్వు..**

దీర్ఘకాలిక ఒత్తిడి సమయంలో కార్టిసాల్ స్థాయిలు పెరగడం వల్ల కాలేయం మరింత గ్లూకోజ్‌ను తయారు చేయడంతోపాటు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. ఇవి శరీరానికి కొన్ని ముఖ్యమైన ప్రక్రియల్లో అవసరమైనప్పటికీ, ఎక్కువ కాలం స్థాయిలు అధికంగా ఉంటే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి శరీరంలో స్వల్పస్థాయి వాపును కూడా పెంచే అవకాశం ఉంటుంది. నిరంతరం ఒత్తిడికి గురైనప్పుడు హార్మోన్లు, నాడీ వ్యవస్థకు సంబంధించిన కొన్ని మార్పులు ఇన్‌ఫ్లమేటరీ మార్కర్లను ప్రభావితం చేస్తాయి. ఇవి గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో సంబంధం కలిగి ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఒత్తిడి వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంతోపాటు శరీరంలో నిల్వ ఉన్న కొవ్వులు రక్తప్రవాహంలోకి విడుదల కావడం కూడా పెరుగుతుంది. దీనివల్ల ట్రైగ్లిజరైడ్లు, మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలు ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల దీర్ఘకాలిక ఒత్తిడిని కేవలం మానసిక సమస్యగా కాకుండా శారీరక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేసే అంశంగా చూడాల్సిన అవసరం ఉంది.

**ఆహారపు అలవాట్లపైనా ఎఫెక్ట్..**

ఒత్తిడి నేరుగా కొలెస్ట్రాల్‌పై ప్రభావం చూపడమే కాకుండా మన ఆహారపు అలవాట్లను కూడా మారుస్తుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు ఆకలి, కడుపు నిండిన భావనను నియంత్రించే హార్మోన్లలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఫలితంగా కొందరిలో భావోద్వేగాలకు అనుగుణంగా ఎక్కువగా తినే అలవాటు ఏర్పడుతుంది. ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు తీపి, కొవ్వు అధికంగా ఉన్న ఆహారాలపై కోరిక పెరగడం సాధారణం. తక్షణంగా ఆకలి లేదా ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్యాకేజ్డ్ స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్, ఇతర అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారాలను ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ ఆహారపు అలవాట్లు కొనసాగితే కొలెస్ట్రాల్ స్థాయిలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఒత్తిడిని ఎదుర్కొనే క్రమంలో కొందరిలో మద్యం తీసుకోవడం కూడా పెరుగుతుంది. అధిక మద్యం వినియోగం ట్రైగ్లిజరైడ్ల స్థాయిలను పెంచడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అదే విధంగా భోజన సమయాలు కూడా మారిపోతాయి. రాత్రివేళ ఆలస్యంగా ఎక్కువగా తినడం వల్ల అధిక కేలరీలు, సంతృప్త కొవ్వులు, ట్రాన్స్ ఫ్యాట్లు శరీరంలోకి చేరే అవకాశం ఉంటుంది.

**ఒత్తిడి, ఆహారం రెండింటి పాత్ర..**

కొలెస్ట్రాల్ పెరగడంలో ఒత్తిడి, ఆహారం రెండింటికీ పాత్ర ఉంటుంది. కేవలం ఒత్తిడిని తగ్గించడం లేదా కేవలం ఆహారాన్ని మార్చడం మాత్రమే సరిపోదు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఒత్తిడి నియంత్రణతోపాటు సమతుల్యమైన ఆహారం, శారీరక చురుకుదనం వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాలి. ఒత్తిడి కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేస్తుందని సూచించే కొన్ని సంకేతాల్లో తరచూ ఆందోళనగా అనిపించడం, రక్తపోటు, ఒత్తిడిలో ఎక్కువగా తినడం, నడుము చుట్టూ కొవ్వు పెరగడం, నిద్ర సరిగా లేకపోవడం, అలసట, సాధారణ ఆరోగ్య పరీక్షల్లో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం వంటివి ఉంటాయి. అయితే ఈ లక్షణాలు ఇతర కారణాల వల్ల కూడా వస్తాయని గుర్తుంచుకోవాలి. ఒత్తిడితోపాటు కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకోవాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. గుండెకు మేలు చేసే ఆహారాన్ని తీసుకోవడం, నిద్ర నాణ్యతను మెరుగుపరచడం, ధ్యానం లేదా మైండ్‌ఫుల్‌నెస్ వంటి పద్ధతులను పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండడమే కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం ద్వారా అవసరమైన మార్పులు చేసుకోవచ్చు.

**ఏం చేయాలి..**

కొలెస్ట్రాల్‌ను ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచేందుకు ఓట్స్, బార్లీ, బీన్స్, పప్పులు, గింజలు, కొవ్వు అధికంగా ఉండే చేపలు, కరిగే పీచు పదార్థం ఎక్కువగా ఉన్న పండ్లు, విత్తనాలు, కూరగాయలు, ఆలివ్ ఆయిల్ వంటి ఆహారాలను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం గుండె ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది. కొలెస్ట్రాల్ పరీక్షల్లో చెడు కొలెస్ట్రాల్ లేదా మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలు పదేపదే అధికంగా వస్తుంటే వైద్యులని సంప్రదించడం అవసరం. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు, రక్తపోటు ఉన్నవారు, మధుమేహం లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. అలాగే దీర్ఘకాలిక ఒత్తిడి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తుంటే దాన్ని నియంత్రించేందుకు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ఒత్తిడి, ఆహారపు అలవాట్లు రెండూ కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేసే మార్గాలు ఉన్నాయి. దీర్ఘకాలిక ఒత్తిడిని నిర్లక్ష్యం చేయకుండా, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, తగినంత నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు. కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగినట్లు పరీక్షల్లో తేలితే కారణాన్ని గుర్తించి సరైన వైద్య సలహా తీసుకోవడం మంచిది.

# విటమిన్ బి12 లోపంతో ఆందోళన పెరుగుతుందా నిపుణులు ఏం చెబుతున్నారంటే




ఆందోళన, చిరాకు, అలసట వంటి సమస్యలకు ఒత్తిడి లేదా మానసిక ఆరోగ్య పరిస్థితులే కారణమని చాలామంది భావిస్తారు. అయితే శరీరంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించినా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంగుంది. ముఖ్యంగా విటమిన్ బి12 లోపం మెదడు పనితీరు, నాడీ వ్యవస్థ, మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బి12 స్థాయిలు తగ్గడం వల్ల ఆందోళనను పోలిన లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే ప్రతి వ్యక్తిలో దీని ప్రభావం ఒకేలా ఉండదు. విటమిన్ బి12 నాడులు సక్రమంగా పనిచేయడానికి, మెదడు మధ్య సమాచార మార్పిడికి అవసరమైన న్యూరోట్రాన్స్‌మిటర్ల తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల శరీరంలో బి12 తగినంతగా లేకపోతే ఆందోళన, చిరాకు, భయాందోళన, మానసిక స్థితిలో మార్పులు, తక్కువ ఉత్సాహం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. విటమిన్ బి12ని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. మెదడు పనితీరు, నాడుల ఆరోగ్యం, ఎర్ర రక్తకణాల తయారీ, డీఎన్ఏ నిర్మాణం వంటి అనేక ముఖ్యమైన ప్రక్రియలకు ఇది అవసరం. శరీరం తగినంత బి12ను స్వయంగా తయారు చేసుకోలేకపోవడంతో ఆహారం ద్వారా పొందాలి. చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చికెన్, మాంసం వంటి వాటిలో విటమిన్ బి12 లభిస్తుంది.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక

# కేయూలో విద్యార్థులకు టీహబ్ ప్రతినిధులతో శిక్షణ



**హనుమకొండచౌరస్తా:** కాకతీయ విశ్వవిద్యాలయ కే–హబ్ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులకు టీ–హబ్ ప్రతినిధులతో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం విశ్వవిద్యాలయ సెనెట్‌హాల్‌లో నిర్వహించారు. కే–హబ్ డైరెక్టర్ ఆచార్య టీ సవితా జ్యోత్స్నసారథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీ–హబ్ ప్రతినిధి బాల మురళి భాస్కరన్ విద్యార్థులకు స్టార్టప్ మెంటార్‌షిప్, ఐడియా జనరేషన్, ఐడియా వ్యాలిడేషన్ తదితర అంశాలపై ఆచరణాత్మక శిక్షణ అందించారు. విద్యార్థులు తమ ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా ఎలా మలచుకోవాలి, ఒక ఆలోచనలోని కొత్తదనం, సృజనాత్మకత, సాధ్యాసాధ్యాలను ఎలా గుర్తించాలి అనే అంశాలను వివిధ ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులు స్టార్టప్‌లు, వ్యాపార ఆలోచనలకు సంబంధించిన పలు ప్రశ్నలను అడగగా, టీ–హబ్ ప్రతినిధులు వాటిని నివృత్తి చేశారు. ఆలోచనలను గుర్తించి, వాటికి సమర్థవంతమైన రూపకల్పన చేసి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇలాంటి 15 శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కే–హబ్ డైరెక్టర్ సవితా జ్యోత్స్న తెలిపారు. ఈ శిక్షణల ద్వారా విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం, అంకుర సంస్థల స్థాపనపై అవగాహన, సృజనాత్మక ఆలోచనా శక్తి మరింత పెంపొందుతుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కే–హబ్ సంయుక్త సంచాలకులు సిద్ధు, కిరణ్ పాల్గొన్నారు.

# రేవంత్ సర్కారు ప్రజల ఆస్తులకు 22ఏ తో సంకెళ్లేసింది బీఆర్ఎస్




**హైదరాబాద్** హైదరాబాద్ లో లక్షల కోట్ల విలువైన ప్రజల ఆస్తులకు రేవంత్‌రెడ్డి సర్కారు '22 తో సంకెళ్లు వేసిందని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. సామాన్యుల ఆస్తులను, దశాబ్దాలుగా ఉంటున్న కాలనీలను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి నెట్టి, సామాన్యుడి కాళ్ల కింద నేలను లాక్ చేశారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఆస్తులు అమ్ముకోలేక, కనీసం బ్యాంకులో కుదువపెట్టి అప్పు తెచ్చుకోలేక ప్రజలు విలవిల్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ప్రజల ఆస్తులను బందీ చేసిన ఈ తుగ్లక్ ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తాము అండగా నిలబడుతామని అన్నారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు వారి ఆస్తులను ఇప్పిస్తామని చెప్పారు.

# 22న ఓరుగల్లు జనసైనికుల ఆత్మీయ సమావేశం




**హనుమకొండ చౌరస్తా:** జనసేన పార్టీ జిల్లా ముఖ్య నాయకులు గాదె పృథ్వీ, పద్మజాదేవి, గడ్డం రాకేష్ మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ నెల 22న హనుమకొండ కేంద్రంగా జరగనున్న ఓరుగల్లు జనసైనికుల ఆత్మీయ సమావేశం పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో జనసైనికులతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పార్లమెంట్ సెగ్మెంట్ల జనసైనికులతో హనుమకొండ కేంద్రంగా ఈనెల 22 శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో వరంగల్ జిల్లా సమస్యలపై జనసేన పోరాటం చేసిందని, రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేస్తూ ప్రజాసమస్యలపై మరింత చురుగ్గా పోరాడుతామన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో జనసేన జెండా ఎగరడం ఖాయం అని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి ప్రతి ఒక జనసైనికుడు హాజరై విజవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా నేతలు అమంచ సునీల్, శివకోటి, రవితేజ, మెడిద ప్రశాంత్‌రెడ్డి, అనుదీప్, బర్ల శివ, బయ్యు పద్మావతి, నాగమణి, ఫరీద్, డేవిడ్, రంజిత్, బండి నాగరాజు, మధుసూదన్, నాగేంద్ర పాల్గొన్నారు.

# మీ కోసం జనతాగ్యారేజ్ తలుపులు తెరిచే ఉంటాయ్ హరీష్‌రావు



**హైదరాబాద్** మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుం చి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పా రు.ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్ (తెలం గాణ భవన్) తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. మూసిపరివాహక ప్రాంతంలోని ఇండ్లను హైడ్రా కూలగొట్టే ప్రయత్నం చేసినప్పుడు జన తా గ్యారేజ్ తలుపు తట్టారని, అప్పుడు వాళ్లకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

# ఇది టోల్ ఫ్రీ నెంబర్ కాదు టోల్ ఫీ నెంబర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హైవేల మీద వాహనాలకు టోల్ ఫీజు వసూలు చేసినట్లుగానే ప్రభుత్వం 1800 599 4788 టోల్ ఫ్రీ నెంబర్ ప్రవేశపెట్టి కమీషన్లు దండుకుంటోందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. 22ఏ కింద బ్లాక్ లిస్టులో పెట్టిన ఆస్తులకు సంబంధించి సర్కారు ఈ టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రవేశపెట్టింది. కస్టార్జితమైన ఆస్తులు కూడా కొన్ని పొరపాటున బ్లాక్ లిస్టులో ఉన్నాయని, టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే వాటిని బ్లాక్ లిస్టు నుంచి తీసేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయగానే మాకు 30% ఇస్తే తీసేస్తామని డీల్ చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు నేరుగా డబ్బులు సంపాదించుకోవడానికే ఈ నెంబర్ పెట్టారని ఆరోపించారు. 22–ఏ తీసుకొచ్చి ఆస్తులను, ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టింది మీరే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని మండిపడ్డారు. తెలంగాణలో ఇందిరమ్మ ఇండ్లను కూడా 22–ఏ లోకి తీసుకొచ్చారని అన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీని వాస్ రెడ్డి ఆదేశాల మేరకే కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపించారు. ఇంతకుముందు కలెక్టంక్కు, ఎమ్మార్వోలకు తెలియకుండా పొం గులేటి భూభారతిలో 22 వేల ట్రాన్సాక్షన్స్ చేశాడన్నారు. అయితే దాని గురించి ఇప్ప టివరకు మాట్లాడలేదని చెప్పారు.

# రాంపూర్ ఊరచెరువు వద్ద వ్యక్తి దారుణ హత్య

**ధర్మసాగర్ :** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలోని ఊరచెరువు వద్ద ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు అతడిని గొంతు కోసి, కత్తితో పొడిచి హత్య చేసినట్లు ఘటన స్థలంలో ఆనవాళ్లు కనిపించాయి. మంగళవారం ఉదయం జరిగిన ఘటన రాంపూర్ గ్రామంలో కలకలం రేపుతోంది. కాగా ఘటన స్థలానికి చేరుకున్న ధర్మసాగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిని జనగామ జిల్లా చిల్పూర్ మండల కేంద్రానికి చెందిన పోలు వెంకటేశ్వర్లు (45)గా పోలీసులు గుర్తించారు. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పెద్ది విగ్రహాన్ని కూల్చడం అమానుషం బీఆర్ఎస్ నాయకులు




**హనుమకొండ చౌరస్తా:** దివంగత నేత తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని కూల్చడాన్ని నిరసిస్తూ చలో నర్సంపేట నిర్వహించాలని వరంగల్ పశ్చిమ బీఆఆర్ఎస్ నాయకులు పిలుపు ఇచ్చారు. దీనిలో భాగంగా ముందస్తుగా వారిని అరెస్టు చేసి హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రభుత్వ అండదండలతో మున్సిపల్, పోలీసులను అడ్డుపెట్టుకొని విగ్రహాన్ని కూల్చివేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను జిల్లావ్యాప్తంగా అరెస్టు చేసి , గృహనిర్బంధాలు చేస్తున్నారని, ప్రజాపాలన పేరుతో దౌర్జన్యాలు చేస్తున్నారని, దివంగత నేత విగ్రహంపై ఇంత అరాచకాలు సృష్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా తమ నేత విగ్రహం పెట్టుకునే హక్కు ఉందని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని బొందపెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వారు అన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ పశ్చి మ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, మైనార్టీ కమిషన్ మాజీ సభ్యులు జూని దర్శన్‌సింగ్, 4వ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కంజర్ల మనోజ్‌కుమార్, బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంద శ్యామ్, పుష్పలత, బీఆర్ఎస్వీ నాయకులు రాసురి రాజేష్ ఉన్నారు.

# మంత్రి జూపల్లి ముందే బాడకావ్ అంటూ బూతులు తిట్టుకున్న కాంగ్రెస్ నాయకులు




**ఆదిలాబాద్ జిల్లా:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పీసీసీసమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ముందే మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డిగొడవపడ్డారు. మంత్రి సమక్షంలోనే బాడకావ్ అంటూ సదరు కాంగ్రెస్ నాయకులు బూతులు తిట్టుకోవడంతో నివ్వెరపోవడం మంత్రి వంతయింది. పీఏసీ సమావేశానికి అల్లూరి సంజీవరెడ్డి ఎలా హాజరు అవుతాడని కంది శ్రీనివాస్ రెడ్డి వర్గం అడ్డుకుంది. దీంతో ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలను సముదాయించారు. పంచాయితీ కాస్తా హైకమాండ్ దృష్టికి వెళ్లడంతో ఇరువురికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి హెచ్చరించారు.

# సిరిసిల్లలో భారీ అగ్నిప్రమాదం యూపీకి చెందిన కార్మికుడు మృతి

**సిరిసిల్ల టౌన్ :** రాజన్న సిరిసిల్లజిల్లా కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పెద్దూరు శివారులోని మహాలక్ష్మి ఫర్నిచర్ దుకాణంలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా 3 ఫైర్ ఇంజన్లతో సిబ్బంది దాదాపు మూడు గంటలకు పైగా శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో రాత్రి దుకాణంలో నిద్రించిన ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన ఒక కార్మికుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ నాగేంద్ర చారి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డెడ్‌బాడీని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

దాదాపుగా 40 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు దుకాణ యజమాని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# నువ్వు లేని రోజు చూడు ఎంత అరాచకమోపెద్ది విగ్రహం వద్ద కన్నీటి పర్యంతమైన సుదర్శన్ రెడ్డి సతీమణి



**వరంగల్ జిల్లా** నర్సంపేటలో అర్ధరాత్రి దొంగ చాటుగా కాం గ్రెస్ సర్కార్ పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొల గించడంతో వరంగల్ జిల్లా నల్లబెల్లిలోని ఆయన స్వగృహం వద్ద విషాద వాతావరణం నెలకొంది. సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్న విగ్రహం వద్ద రోదిస్తూ భావోద్వేగానికి గుం య్యారు. భర్తను తలచుకొని కన్నీటి పర్యం తమవుతూ "నువ్వు లేని రోజు చూడు.. ఎంత అరాచకమో" అంటూ విలపించారు. ఆమె రోదించిన తీరు అక్కడున్న వారిని కలచి వేసింది. కుటుంబం గురించి కాకుండా ఎప్పు డూ ప్రజల గురించే ఆలోచించిన వ్యక్తి విగ్రహం తొలగించడం తట్టుకోలేకపోతున్నా మని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఎక్కడో బయట చౌరస్తాలో పెట్టలేదు.. అభిమానంతో ఒక వ్యక్తి ప్రైవేట్ స్థలంలో చిన్న విగ్రహం ఏర్పాటు చేశాడు. ఈరోజు దొంతి మాధవరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆ విగ్రహాన్ని కూల్చివేయడం బాధాకరమన్నారు. కాగా, రాత్రి 3 గంటలకు.. 1500 మంది పోలీసుల పహారా మధ్య దొంగచాటుగా దివం గత తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువె త్తుతు న్నాయి. ఉద్యమకారుడి విగ్రహాన్ని అర్ధ రాత్రి భారీ బందోబస్తు మధ్య తొలగించడం కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు రాజకీ యాలకు పరాకాష్ట అని సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇక్కడితో ఆగని పోలీసులు వరంగల్ జిల్లా నర్సంపేటలో బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. నల్లబెల్లిలోని పెద్ది నివాసం చుట్టూ 400 మంది పోలీసుల మోహరి ంచారు. దీనిపైబీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమ న్నాయి. ఇది ప్రజాస్వామ్య పాలనా లేక రేవం త్ రెడ్డి సర్కార్ సాగిస్తున్న దమన కాండా విగ్రహాన్ని దొంగచాటుగా తొలగించినంత మాత్రా న ప్రజల గుండెల్లో పెద్ది సుదర్శన్ రెడ్డిపై ఉన్న అభిమానాన్ని ఎప్పటికీ చెరిపివేయలేరు. కాంగ్రెస్ సర్కార్ కక్ష సాధింపులకు తెలంగాణ ప్రజలేతగినబుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# మేం ఇంజినీరంగ్ చేయాలంటే మళ్లీ ఇంటర్ చేసి రావాలా పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ధర్నాకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి తెచ్చిన శక్తి స్కీమ్ వల్ల మా మూడేళ్ల చదువు వృథా అవుతుందని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పుడు తాము ఇంజినీరింగ్ చేయాలంటే మళ్లీ ఇంటర్ చేసి రావాలాఅని రేవంత్ సర్కారును ప్రశ్నించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీపేరుతో 97ని తీసుకొచ్చి డిప్లొమా కోర్సులను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేయడంవల్ల డిప్లొమా విద్య ప్రాధాన్యత తగ్గుతుందని విద్యార్థులు అంటున్నారు. జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని వికారాబాద్ పట్టణంలో కూడా పాలిటెక్నిక్ విద్యార్థులు నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ స్కీమ్ వల్ల సాంకేతిక విద్యా మండలి స్వతంత్రత దెబ్బతింటుందని, డిప్లొమాను సాధారణ శ్రామిక శిక్షణగా మారుస్తున్నారని ప్రభుత్వం విడుదల చేసిన ఈ ను రద్దు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. అసలు ఎవరిని అడిగి ఈ స్కీమ్ తెచ్చారు రేవంత్ రెడ్డి గారు.

అని విద్యార్థులు నిలదీస్తున్నారు.

రేవంత్ రెడ్డి తెచ్చిన శక్తి స్కీమ్ వల్ల డిప్లొమా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెస్తే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అంటున్నారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.